# 7

# ప్రభువైన యేసును మనం ఏ దృష్టితో చూద్దాం?

యూనివర్సిటీ విద్యార్థులు తరచుగా పరిశోధనా ప్రణాళికలు చేయవలసిందిగా నిర్ణయింపబడతారు. ఈ పరిశోధనా కార్యక్రమంలో వారు ఎల్లప్పుడు సంతోషాన్ని అనుభవించరు. పరిశోధన విషయం వారికుండే తత్వానికి రెండు కారణాలుండవచ్చు. మొదటిది, పరిశోధన అనేది తరచుగా కష్టమైన పని. "చదవడానికి నేను ఎంజాయ్ చేయను, ఎవరైనా చదువుతుంటే ఎంజాయ్ చేస్తానని" ఒక వ్యక్తి అన్నాడు. అనేకమంది విద్యార్థులు రీసర్చ్ చేయడంలో ఆనందాన్ని అనుభవించరుగాని, రీసర్చ్ చేసినందుకు ఎంజాయ్ చేస్తారు. రెండవది, రీసర్చ్ అంతా ఎక్కువగా తెరువబడిన అంతమై యుంటుంది. మనకు ఏమి తెలిసిందో ఏమి తెలియలేదో అనేదాన్ని రీసర్చ్ విడదీస్తుంది – కొన్ని సార్లు మనకు తెలిసిన దానికంటె ఎక్కువగా మనకు ఏమి తెలియలేదో అది స్పష్టమౌతుంది. "నేను ఈ రీసర్చ్ ప్రాజెక్ట్ ఆరంభించకముందు, ఈ ప్రాజెక్టును గూర్చి నాకు ఏమి తెలియదు. ఇప్పుడు నేను ఈ ప్రాజెక్టును ముగించాను, ఈ సబ్జెక్టును గూర్చి ఎవరికి ఏమి తెలియదని నాకు తెలుసునని ఒక రీసర్చ్ ప్రాజెక్టును ముగించిన విద్యార్థి అనవచ్చు!" అలాటి ముగింపు బహు నిరాశపరచేదిగా ఉండవచ్చు.

కొన్ని కీలకమైన అంశాలను గూర్చిన సత్యాన్ని మనమందరం తెలిసికో గోరతాం. తెరువబడిన ముగింపులతోగాని, వాటిని గూర్చి తీర్మానానికి రాని చర్చలతోగాని మనం తృప్తి చెందం. అందులో ప్రత్యేకించి ప్రభువైన యేసుక్రీస్తు అనే అంశాన్ని గూర్చి యిది సత్యం. ఆయనను గూర్చి ఎవరో చెప్పిన అభిప్రాయం గాని, లేదా ఆయననుగూర్చి స్పష్టంగా లేని సిద్ధాంతాల చర్చలుగాని, మనకు అక్కరలేదు; ఆయనను గూర్చిన సత్యాన్ని తెలిసికోవాలని మనం వాంఛిస్తున్నాం. ఆయనను గూర్చిన లోతైన ప్రశ్నలు నిర్దిష్టమైనవి

గాను, సూటిగాను ఉన్నాయి: యేసు ఎవరు? ఆయన నిజముగా దేవుని కుమారుడేనా? జీవాన్ని గూర్చి, రక్షణను గూర్చి ఆయన ఏమి చెప్పారు? అనేవి అవసరం.

ఈ ప్రపంచంలో బైబిలు మాత్రమే హెచ్చుతగ్గులులేని సత్య గ్రంథం. ఆయన ఉపదేశాల విషయములో మనము నిశ్చయత కలిగియుండునట్లు దేవుడే దానిని మనకు ప్రసాదించాడు (2 పేతురు 1:3). ప్రభువైన యేసును గూర్చి తీర్మానంలేని విధానంలో మనం ఈ జీవితం గుండా వెళ్లాలని దేవుడు కోరడంలేదు. ప్రభువైన యేసు ఎవరో, ఏమి జరిగించడానికి ఆయన ఈ లోకానికి అవతరించారో మనం తెలిసికోవాలని ఆయన కోరుతున్నాడు. ఆయనను గూర్చి పరిపూర్ణమైన సత్యం కలిగియుండి సత్యముపైననే ధైర్యమును పూర్ణ నిశ్చయతతోకూడిన జీవితాలను కట్టుకోవలసినదిగా ఆయన మనలను కోరుతున్నాడు.

ప్రభువైన యేసునుగూర్చి అధికారపూర్వకమైన రూపచిత్రాన్ని బైబిలు మాత్రమే మనకిస్తుంది. ఆయన యేమైయున్నాడో రెండు విధాలుగా అది మనకు తెలుపుతోంది: మొదటిది, లేఖనాలలో ఆయన ఏమని పిలువబడ్డాడో దాన్ని గుర్తించడం ద్వారా ఆయన ఏమైయున్నాడో మనం చూస్తాం. రెండవది, ఆయనకు ఆరోపింపబడిన విశేష లక్షణాలను గమనించడం ద్వారా ఆయన ఏమైయున్నాడో చూస్తాం.

బైబిలులో ఆయన ఏమని పిలువబడ్డాడో జాగ్రత్తగా ఆలోచించు. మనం నమ్మే ఏదో యొకనిచేత మంచి సువార్తికుడు మరియు ఉపదేశకుడని ఒక మనిషి మనకు పరిచయం చేయబడినట్టయితే, ఆ మనిషి ఎవరైయున్నాడో, అతడు ఎలాటి వ్యక్తియో ప్రాథమికంగా మనం ఎరుగుతాం. "సువార్తికుడు," "ఉపదేశకుడ"నే పదాలు అతని గూర్చి మనకు ఒక ప్రత్యేకమైన రూప చిత్రాన్ని యిస్తాయి.

ప్రభువైన యేసు యొక్క పోలికను గూర్చి లేఖనాలు మనలను అనుమానాస్పదంలో విడిచిపెట్టవు. అపార్థము చేయబడని పదాలతో ఆయన నిర్దిష్టంగా చూపబడ్డారు. లేఖనాల్లో ప్రభువైన యేసు ఏమని పిలువబడ్డారో మనం జాగ్రత్తగా పఠించుతుండగా, ఆయన ఎవరో మనం నేర్చుకుంటాం.

## ఆయన మన రక్షకుడు

మొదట, లేఖనాలు యేసును "రక్షకుడని" పిలుస్తాయి. భయంకరమైన అపాయము నుండి యితరులను తప్పించేవాడిని "రక్షకుడనే" పదం సూచిస్తుంది.

ఆయన జన్మకు సంబంధించి, దాఖలు చేయబడిన మత్తయి మాటల్లో, ప్రభువైన

యేసుకు భూ సంబంధమైన తండ్రిగా ఎంచబడిన యోసేపునకు స్వప్నమందు దేవదూత కన్పించినట్టు ప్రస్తావించబడింది. ఆ దేవదూత చెప్పింది ఏమంటే,

> ... దావీదు కుమారుడైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరుపెట్టుదువు (మత్తయి 1:20, 21).

నీవు చూస్తున్నట్టే, ప్రభువైన యేసు ఏదో యొక సాధారణమైన రక్షకుడు కాదు; ఆయన ఏకైకమైన రక్షకుడైయుండాలి. మండుతున్న భవనంలోనుండి ఒక మనిషి బిడ్డను రక్షించినట్లయితే, అతన్ని రక్షకుడని మనం పిలువవచ్చు. ఆకలితో అలమటించు తున్న జనులకు ఒక మనిషి భోజనాలను సరఫరా చేసినట్లయితే, అతడు ఆ జనులకు రక్షకుడని పిలువబడతాడు. లేఖనముల ప్రకారము, ప్రభువైన యేసు మనలను పాపములనుండి రక్షిస్తారు. ఆయన మనకు ఆత్మసంబంధమైన రక్షకుడైయున్నాడు.

బాధ్యతగల ప్రతి వ్యక్తి ఎదుర్కొనే మొదటి కష్టము పాప దోషము. మన మెడలచుట్టు టేపురికార్డులను కట్టి, నలభై ఎనిమిది గంటలలో మనం మాట్లాడే ప్రతి మాటను రికార్డు చేసినట్లయితే, మనము పాపులమని తేలికగా చూడవచ్చునని ఎవరో ఒకరన్నారు. మనం కూర్చుండి, ప్రతి మాటను ఆలకించినట్లయితే, ప్రతి ప్రతిపాదన వెనుకనున్న ఉద్దేశాన్ని ఆలోచించినట్లయితే, ఎలాటి స్వరంతో మనం పలికామో ధ్యానించినట్లయితే, మనం ఏమి చెప్పవలసియుందో అన్ని సమయాలలో అలాగే చెప్పలేదని తప్పక లేక నిశ్చయముగా నిర్ణయానికి వస్తాం. అలాగే, నలభై ఎనిమిది గంటలు మన జీవితాలను ఫోటో తీయడానికి వీడియో కెమెరాలను మనం ఉపయోగించవచ్చు. మనం చేసిన ప్రతి యాక్షన్, పనిని తిరిగి మనం తిలకించినప్పుడు, మనం పాపులమైయున్నట్టు స్పష్టంగా చూడగలుగుతాం. చేయవలసినవి చేయలేదని, చేయకూడనివి చేసియున్నామనే సత్యముతో తరచుగా మనం కొట్టబడతాం. మనం పాపులమని చెప్పడానికి బైబిలు సహితం మనకవసరముండదు. మన మాటలను, చేష్టలను మనం సమీపించి చూచి నప్పుడు మనం పాపులమని మనమే ఎరుగుతాం. అయినా, బైబిలు మాత్రం, మనలను గూర్చిన సత్యాన్ని అసమానమైన భాషలో ప్రకటిస్తుంది. "... 'నీతిమంతుడు లేడు, ఒక్కడునులేడు' " అని పౌలు క్రైస్తవులకు గుర్తు చేశాడు (రోమా 3:10).

మన పాపము విషయమై మనం ఏమి చేయగలం? మనలను మనము క్షమించుకోలేము. మన పాపము యితరులకు విరోధమైనది మాత్రమే కాదు, అది

దేవునికి కూడా విరోధమైనదే. వెంటనే గమనింపవలసిన ఈ అవసరతకు ఎవరు సహాయపడగలరు? మానసిక స్థితి మనలను క్షమించనేరదు. నిశ్చయమైన చింతన (positive thinking) వలన కుదరదు. పాపులము కామని చేసే నటన సహాయపడలేదు. మరి యింకేమి చేయాలి? నిరాశతో కూడిన మన పరిస్థితికి దేవుని జవాబు ప్రభువైన యేసే. భూమిమీద ఆయన నెరవేర్చబోయే కార్యాన్ని బట్టి యేసు అనే పేరు ఆయనకు పరలోకమందే తీర్మానించబడినట్లు యోసేపుకు తెలుపబడింది. ఆయన జన్మించినప్పుడు, పాలస్తీనా కొండమీదనున్న గొర్రెల కాపరులకు దేవదూత యిలా ప్రకటించాడు, “దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు” (లూకా 2:11). ప్రభువైన యేసు భూలోకానికి అరుదెంచుటలో ప్రధానమైన ఉద్దేశం మనలను మన పాపములనుండి రక్షించుటయే (1 కొరింథీ. 15:3).

నెపోలియన్ సైన్యంలో ఒక సిపాయిని గూర్చి మనస్సును కరిగించెడి యొక కథ చెప్పబడింది. అతడు ధైర్యవంతుడును, నమ్మకస్థుడైన సైనికుడుగా ఉన్నాడు. యుద్ధానికి యుద్ధానికి మధ్యలో తన డేరాలో ఉంటూ తన బాధ్యతలను గూర్చియు, కుటుంబంయొక్క అక్కరలను గూర్చియు తిరిగి ఆలోచిస్తుండేవాడు. ఒక కాగితం తీసికొని తనకున్న అప్పులు, తన కుటుంబపు అక్కరల నిమిత్తం అవసరమైన డబ్బును వరుసగా వ్రాశాడు. తన కుటుంబ ఖర్చులకును తన అప్పులకును అవసరమైనంత (లేక) కావలసినంత డబ్బు తనకు లేదన్న సంగతి గ్రహించగానే తనలో ఒక నిరాశతోకూడిన తరంగం పొర్లింది. ఆర్థికపరమైన తన బాధ్యతలను క్రమంగా వ్రాసిన దానిక్రింద, బహుగా చింతాక్రాంతుడై యిలా లిఖించాడట, “నా అప్పులన్నిటిని చెల్లించగలవాడెవడు?” పరాజితుడైనట్టి భావనతో, తన చేతులలో తలపెట్టుకొని నిద్రించాడట. సైనికులకు తెలియకుండగనే, తన సైనికుల శిబిరంలోగుండ వారి పరిస్థితులను పరిశీలించుతూ, వారి బలాన్ని అంచనా వేస్తూ నెపోలియన్ సంచారం చేస్తున్నాడట. ఆ యువకుని డేరాను దాటి వెళ్లుతూ, తనిఖీచేయ నాజ్ఞాపించాడటగాని, ఆ డేరాలోనుండి ఏ బదులు రాలేదు. అతడు నేరుగా వెళ్లి లోపల చూచాడట. ఒక ప్రక్క నిదురించుతున్న సైనికుని, మరోవైపు ఆ పేజీకి అడుగున పరితాపకరమైన ప్రశ్నను అతడు చూచాడట. నెపోలియన్ క్రిందికివంగి, తన పేనా తీసి, ఆ ప్రశ్న క్రింద “నేను చెల్లిస్తాను” అని వ్రాసి, “నెపోలియన్” అని సంతకం పెట్టాడట.

మనం మన పాపపు రుణము వైపును, అపాయకరమైన మన రక్షణ యొక్క అవసరతను చూచినప్పుడు, “ఈ అప్పులన్నీ చెల్లించగలవారెవరు?” అని మనం దుఃఖిస్తాం. నెపోలియన్ కంటే ఎంతో ఉన్నతమైనవాడు “నేను చెల్లిస్తాను” అని అన్నాడు.

లోకరక్షకుడైన యేసు, సిలువపై తన మరణము ద్వారా, సంపూర్ణ రక్షణను కొని ప్రసాదించడానికి ఆయన వచ్చాడు.

ప్రభువైన యేసు మాత్రమే మనకు ఏకైక రక్షకుడైయున్నట్లు బైబిలు తేటపరచుతోంది. "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" అని పేతురు అన్నాడు (అపొ. 4:12). నీవు నీ పాపములనుండి రక్షింపబడి, అంగీకార యోగ్యమైన స్థితిలో నీవు దేవుని యెదుట నిలవాలని కోరితే, నీవు క్రీస్తు వద్దకే రావాలి (యోహాను 14:6; మార్కు 16:16). బైబిలు ప్రకారం ఆయన మన రక్షకుడైయున్నాడు.

## క్రీస్తుగా (అభిషిక్తుడుగా)

రెండవది, ప్రభువైన యేసు "క్రీస్తు" అని కూడా పిలువబడ్డాడు; అంటే అభిషిక్తుడని అర్థం. హెబ్రీ భాషలో "మెస్సీయా" అనేదే గ్రీకు భాషలో "క్రీస్తు" అని అంటారు. ప్రభువైన యేసును వాగ్దానం చేయబడిన వానిగాను, దేవునిచే ఏర్పరచబడిన వానిగాను క్రొత్త నిబంధన గుర్తిస్తోంది.

దేవుని యొక్క ప్రత్యేకమైన సేవకుడు రానైయున్నట్లు ప్రవక్తలు ముందుగా ప్రవచించారు:

> ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను ఆయన భుజముమీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును. ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును. న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును. సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తికలిగి దీనిని నెరవేర్చును (యెషయా 9:6, 7).

మీకా యిలా ప్రవచించాడు, "బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్పగ్రామమైనను నాకొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును; పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను" (మీకా 5:2). వచ్చునని ప్రవక్తలు ప్రవచించినది ప్రభువైన

యేసును గూర్చియేనని క్రొత్త నిబంధన రుజువు చేస్తుంది.

భూమి మీద తన పరిచర్యను ముగించే సమయం ఆసన్నమైనప్పుడు, ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతానికి ప్రభువు తన శిష్యులతోకూడా వచ్చారు. వారు నడిచిపోతూ ఉండగా, "మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని" తన శిష్యులను అడుగగా, వారు "కొందరు బాప్తిస్మమిచ్చు యోహానని యు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి" (మత్తయి 16:13, 14). అందుకాయన "మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని" వారినడిగెను. అందుకు సీమోను పేతురు – "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తు"వని చెప్పాడు (మత్తయి 16:15, 16). పేతురు యొక్క జవాబును బట్టి ఆయన అతని మెచ్చుకొని, "సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనేకాని, నరులు నీకు బయలుపరచలేదు.." అని అన్నాడు (మత్తయి 16:17). మరొక మాటల్లో చెప్పాలంటే, "పేతురూ, మనుష్యుడు ఏదో చెప్పినదానిని బట్టి నీవు ఈ తీర్మానానికి రాలేదు. నీవు జవాబును పరలోకమందున్న దేవునినుండియే పొందావని" ప్రభువు అతనితో అన్నాడు. అది మనుష్యుడు తెచ్చుకున్న తీర్మానం కాదు, అది కేవలం దైవ ప్రత్యక్షత లేక దేవుని బయల్పాటు మాత్రమే.

క్రొత్త నిబంధన ప్రభువైన యేసును ఎలా సూచిస్తుందో ఆలోచించు. "క్రీస్తు" అని అది ఆయన్ను పిలుస్తున్నప్పుడు, ఆయనొక్కనినే, దేవునిచే ప్రత్యేకంగా ఏర్పరచుకొన్నవానిగా గుర్తిస్తుంది. ఆయన ఒకనికి ముందుగా పంపబడినవాడు కాదు, ఈయనే ఆ ఒక్కడు. ఏర్పరచబడినవాని యొక్క రాకను ఆయన ముందుగా సూచింపలేదు; ఏర్పరచబడిన వానిని గూర్చిన ప్రవచనాలన్నిటికి ఆయన నెరవేర్పై యున్నాడు. ఏర్పరచబడిన వానితో ఆయన కేవలం కలిసియున్నవాడు కాదు. సాక్ష్యాత్తు ఈయనే ఆయన.

## దేవుని కుమారుడుగా

మూడవది, దేవుని కుమారుడుగా, అంటే దేవత్వంలోని రెండవ వ్యక్తిగా ప్రభువైన యేసును క్రొత్త నిబంధన గుర్తిస్తుంది.

ప్రభువైన యేసు భూ నివాస పరిచర్యకొరకు మార్గాన్ని సిద్ధపరచేవాడుగా బాప్తిస్మమిచ్చు యోహాను దేవునిచే ఏర్పాటు చేయబడ్డాడు. పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మాన్ని ప్రకటించుతూ అతడు ఆ కార్యాన్ని జరిగించాడు

(మార్కు 1:4). తన సువార్త ప్రకటనకు విధేయులైన వారికి రానైయున్న మెస్సీయాను యోహాను చూపుతూ వచ్చాడు. మెస్సీయా వచ్చినప్పుడు ఆయనను అంగీకరింతుమన్నట్టు ప్రజలు తమ మారుమనస్సు బాప్తిస్మములయందు హామీ యిచ్చారు (అపొ. 19:4). దేవుడు తనకు అప్పగించిన పనిని యోహాను నెరవేర్చుతూ ఉండగా, యూదయ వారందరును, యొర్దాను నదీ ప్రాంతముల వారందరును అతని యొద్దకు వచ్చి, అతనిచే బాప్తిస్మము పొందుతూ ఉన్నారు (మత్తయి 3:5). ఒక దినాన యోహాను నదిలో జనులకు బాప్తిస్మమిచ్చుచుండగా, యొర్దాను నదీ తీరాన ప్రభువైన యేసు ప్రత్యక్షమయ్యారు. యోహానైతే, ఆ సమయంలో యేసే మెస్సీయా అనే వాస్తవం నిశ్చయంగా ఎరుగనివాడై యున్నాడు (యోహాను 1:29–31) – కాని ప్రభువు తనకంటే శ్రేష్ఠుడైన మనిషియని మాత్రం అతడెరుగు. వాస్తవం అలా ఉండగా, తనకు బాప్తిస్మం యివ్వమని కోరే ప్రభువు యొక్క విన్నపానికి, "నేను నీచేత బాప్తిస్మము పొందవలసిన వాడనై యుండగా నీవు నాయొద్దకు వచ్చుచున్నావా?" అన్నట్టు అతడు ఆయనను నివారింప జూచాడు. అందుకు ప్రభువు – "ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని" అతనితో అన్నాడు (మత్తయి 3:15). యోహాను దేవుని పరిచర్యను జరిగిస్తున్నాడు. అతడు దేవునిచే పంపబడిన మనిషి. ఈ భూమి మీద ఉన్న దినాల్లో ప్రభువైన యేసు దేవునికి సంపూర్ణంగా లోబడియుండాలని కోరుకున్నాడు. అలాగున ఆయన యోహానుచే విధేయతగా బాప్తిస్మం పొందాడు – ఆయనకు పాపముండి దానికి క్షమాపణ అవసరమై కాదు, ఆయనకు మారుమనస్సు అవసరమై కాదు లేదా మెస్సీయా ప్రత్యక్షమైనప్పుడు ఆయనను స్వీకరించవలసిన అక్కర కలవాడైనందున కాదు. మెస్సీయా ఆయనే, కాని బాప్తిస్మమిచ్చు యోహాను బాప్తిస్మానికి తన్ను తాను లోబరచుకొన్నది దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికిని, నీతి యావత్తు నెరవేర్చ డానికిని మాత్రమే.

ముంచడం అయిన అనంతరం యోహాను ప్రభువైన యేసును ఒడ్డునకు నడిపిస్తుండగా, దేవుని ఆత్మ ఆయన మీద పావురమువలె దిగెను. ఈ అద్భుతమైన సంభవం యోహాను తిలకించినప్పుడు యేసు మెస్సీయాయై యున్నాడని యోహాను తెలిసికొన్నాడు (యోహాను 1:32–34). అప్పుడు, పరలోకంనుండి యొక శబ్దం – దేవుని యొక్క స్వరమే – "ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నానని" పలికింది (మత్తయి 3:17). యేసు తన కుమారుడనే దేవుని సాక్ష్యం క్రొత్త నిబంధనలోని ఈ వచనాల్లో పొందుపరచబడింది.

ప్రభువైన యేసు దేవుని కుమారుడనడానికి మూడు సాక్ష్యాలు యివ్వబడినట్టు

అపొస్తలుడైన యోహాను అన్నాడు. “సాక్ష్యమిచ్చువారు ముగ్గురు, అనగా ఆత్మయు, నీళ్లను, రక్తమును, ఈ ముగ్గురు ఏకీభవించియున్నారు” (1 యోహాను 5:7, 8). ప్రభువు బాప్తిస్మం పొందిన వెంటనే పరిశుద్ధాత్మ పావురమువలె ఆయన మీదికి దిగివచ్చి, యేసు దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చాడు. ఇతర సమయాలలో సువార్త రచనలయందు కూడా పరిశుద్ధాత్మ ఈ సాక్ష్యమిచ్చాడు. “నీళ్లు” అనేది పరలోకమునుండి తండ్రియైన దేవుడు యేసు తన కుమారుడని సాక్ష్యమిచ్చినప్పటి బాప్తిస్మాన్ని సూచిస్తుండాలి. “రక్తమ”ని యోహాను సూచించేది ప్రభువైన యేసు యొక్క మరణానికి ప్రాతినిధ్యం యిచ్చి ఉండాలి. సిలువ మరణాన్ని ఆవరించి జరిగిన అద్భుతమైన సంఘటనలు ఆయన దేవత్వాన్ని గూర్చి సాక్ష్యమిస్తున్నాయి. “మనము మనుష్యుల సాక్ష్యము అంగీకరించుచున్నాము గదా! దేవుని సాక్ష్యము మరి బలమైనది. దేవుని సాక్ష్యము ఆయన తన కుమారుని గూర్చి యిచ్చినదే”యని యోహాను అన్నాడు (1 యోహాను 5:9). యథార్థవంతులైన ముగ్గురు మనుష్యులు ఒక సత్యాన్ని గూర్చి సాక్ష్యమివ్వడంలో ఏకీభవించినట్లయితే, మనం వారి సాక్ష్యాన్ని అంగీకరిస్తాము. అలాగే భూమిమీద ఏ న్యాయస్థానంలోనైనా. అలాటప్పుడు దేవుని సాక్ష్యాన్ని మనం యింకా ఎంతగా అంగీకరించాలో! ఆయన తన కుమారుని గూర్చి యిచ్చిన సాక్ష్యం (ఆయన బాప్తిస్మం పొందిన సమయంలో) – ఆత్మ యిచ్చిన సాక్ష్యం, నీటియొక్క సాక్ష్యం (ఆయన బాప్తిస్మమందు తండ్రియొక్క స్వరం వినిపించింది), రక్తము యొక్క సాక్ష్యం (ఆయన మరణ సమయంలో అద్భుతాలు సంభవించినప్పుడు).

యేసు ఎవరు? జవాబు విషయంలో లేఖనాలు ఏ సందేహానికి చోటునివ్వలేదు. యేసు దేవుని కుమారుడని క్రొత్త నింబంధన స్పష్టంగా బోధిస్తుంది. ఆయనను నిర్లక్ష్యపెట్టడానికి వీలుండదు. ఆయన్ను నిర్లక్ష్యపెడితే దేవుని నిర్లక్ష్యపెట్టినట్టే.

## ప్రభువుగా

నాల్గవది, క్రొత్త నిబంధన యేసును “ప్రభువని” పిలుస్తుంది. దేవుని యొద్దనుండి పొందిన సర్వాధికారంతో ఆయన అత్యున్నతమైన ఏలికగా ఉన్నాడు.

ప్రభువైన యేసు మృతులలోనుండి పునరుత్థానుడైన తరువాత, ఆయన నిజంగానే మృతులలోనుండి లేచినట్టు తన శిష్యులకు రుజువుపరచుతూ ఆయన వారికి ప్రత్యక్షుడయ్యాడు. అప్పుడు ప్రభువు తన శిష్యులతో యిలా అన్నాడు,

> పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను (మత్తయి 28:18-20).

ప్రభువైన యేసు తండ్రియైన దేవుని యొద్దకు ఆరోహణమైన పది దినాలకు, అపొస్తలులమీదికి పరిశుద్ధాత్మ కుమ్మరింపబడ్డాడు. ఆ రోజున, అంటే పెంతెకొస్తు దినాన, కూడివచ్చిన బహు జన సమూహములతో పేతురు మాట్లాడాడు. యేసే క్రీస్తని నిరూపించడానికి అతడు రుజువులనిచ్చాడు. తన ప్రసంగం యొక్క శిఖరాగ్రానికి అతడు చేరుకున్నప్పుడు వారు సిలువవేసిన ఈ యేసునే "ప్రభువుగాను క్రీస్తుగాను" దేవుడు (అపొ. 2:36) ప్రతిష్ఠించినట్లు తీర్మానించవలసిందిగా అతడు తన శ్రోతలనడిగాడు. ప్రభువైన యేసు తన్ను తాను రిక్తునిగా చేసికొని, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా ఎలా విధేయత చూపాడో వర్ణించిన తదుపరి, పౌలు యిలా వ్రాశాడు:

> అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమిక్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పీ. 2:9-11).

ఇంకను ప్రభువైన యేసును గూర్చి పౌలు యిలా వ్రాశాడు, "మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ. 1:22, 23).

క్రొత్త నిబంధన ప్రకారము, యేసు ప్రభువుగా నియమింపబడడమంటే మనకేమి భావం వస్తుంది? ఆచరణ యోగ్యమైన పదాల్లో దాని అర్థమేమంటే – మనం ఆయనకు లోబడియుండాలి అనేదే. "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక – ప్రభువా ప్రభువా, అని నన్ను పిలుచుట ఎందుకు?" అని ప్రభువైన యేసు అన్నారు (లూకా 6:46). "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో

ప్రవేశింపడుగాని, పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" అని ఆయన యింకా అన్నాడు (మత్తయి 7:21). నీవు క్రీస్తు సందేశాలకు లోబడుటకు ఇష్టపడుతున్నావా? రెండవది, మన జీవితాలలో క్రీస్తుకు ప్రథమ స్థానం యివ్వాలని దాని భావం. మన నమ్మకత్వాన్ని, ప్రేమను మనం ఆయనకు యివ్వబద్ధులమై యున్నాం. ఏకైక ప్రభువుగా పరలోకము ఘనపరచేది ఆయననే, మన హృదయాలలో సింహాసనాసీనునిగా చేయబడవలసిన ప్రభువు ఆయన ఒక్కడు మాత్రమే.

ఒక వ్యక్తి యిలా అన్నాడు, "ప్రతి హృదయంలో, ఒక సిలువ, ఒక సింహాసనం ఉంటాయి. నన్ను నేను సింహాసనం మీద కూర్చుండబెట్టుకొన్నానంటే, నేను క్రీస్తును సిలువపై ఉంచాలి. నేను క్రీస్తు ప్రభువును సింహాసనం మీద కూర్చుండ బెట్టినట్లయితే, నన్ను నేను సిలువపై ఉంచుకోవాలి." ఎవనికి యిద్దరు ప్రభువులుండడానికి వీలులేదు. క్రీస్తుయొక్క ఆధిపత్యానికి "అవును" అని నీవు చెప్పినట్లయితే, నీ సొంత కోర్కెల యిష్టానికి "కాదు" అని చెప్పాలి. ఎవనికి యిద్దరు యజమానులుండ వీలుపడదు; నీవు ఒకని ప్రేమించి, మరియొకని ద్వేషిస్తావు (మత్తయి 6:24).

క్రొత్త నిబంధన యేసును ప్రభువని అంటుంది. దేవుడు సమస్తాన్ని ఆయన పాదముల క్రింద ఉంచాడు. ఆయన రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునైయున్నాడు.

## ముగింపు

అయితే, యింతకు, యేసు ఎవరు? లోకంలో సంపూర్ణంగా హెచ్చు తగ్గులులేని ఏకైక గ్రంథం – ఆయన రక్షకుడని, క్రీస్తు అని, దేవునిచే ఏర్పరచబడినవాడని లేక యిష్టుడని, దేవుని కుమారుడని, ప్రభువని చెప్తుతోంది. ఇది ఆయనను గూర్చిన సత్యం. ఆయన అలాగైయున్నాడని నిశ్చయంగా ఎరగడానికిగాను, మరొక పరిశోధన జరిగేవరకు నీవు వేచియుండనవసరం లేదు. ఆయనను గూర్చి పరిపూర్ణమైన సత్యము బైబిలు చెప్తుతుంది.

ప్రభువైన యేసు లోకానికి అవతరించడంతో మన క్యాలండరు క్రీ. పూ. మరియు క్రీ.శ.గా విభాగింపబడింది. రక్షింపబడినవారు, నశించినవారని మానవ జాతిని ఆయన రెండుగా విభజింపబోతాడని మత్తయి 25:31-46 అంటుంది. తీర్పునందు ప్రభువైన యేసు తన యెదుట నిలిచాడని పిలాతు తలంచాడు, కాని వాస్తవానికి పిలాతు ప్రభువు యెదుట నిలిచాడు. లోకానికి చివరి దినాన, ప్రభువైన యేసు యొక్క సింహాసనానికి కుడివైపున రక్షింపబడినవారు, ఆ సింహాసనానికి ఎడమవైపున నశించినవారు నిలుస్తారు.

ప్రభువైన యేసుకు నీవు యిచ్చే జవాబును బట్టి కుడివైపుననే ఉంటావో లేక ఎడమవైపుననే నిలుస్తావో తేల్చబడుతోంది. ఆయన ప్రసాదించే రక్షణద్వారానే నీవు ఆయన కుడివైపున నిలిచేదానికి వీలుంటుంది. "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని ఆయన అన్నాడు (యోహాను 14:6). నీవు ప్రభువైన యేసుద్వారా దేవుని యొద్దకైనా చేరుకుంటావు, లేదా నిత్య నాశనమైనా అనుభవిస్తావు. మనకు జీవము కలుగునట్లు ఆయన వచ్చాడు (యోహాను 10:10); ఆయన లేకుండ నిత్య మరణంలో నిలిచియుంటాం.

రక్షణకొరకు తన యొద్దకు రమ్మని ప్రభువైన యేసు ఆహ్వానిస్తున్నాడు. ఇతర మత నాయకులైతే వారి విధానాలలోనికి, వారి బోధలలోనికి నిన్ను ఆహ్వానిస్తారు. దేవుని కుమారుడైన యేసు మాత్రమే తన యొద్దకు రమ్మని నిన్ను ఆహ్వానిస్తున్నాడు, "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని ఆయన అంటున్నాడు (మత్తయి 11:28).

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు – 250వ పేజీలో*)

1. "రక్షకుడ"నే పదం దేన్ని సూచిస్తుంది?
2. ప్రభువైన యేసు ఎలా ఏకైక రక్షకుడు?
3. "క్రీస్తు" అంటే అర్థమేమి?
4. యేసు దేవుని కుమారుడని మనకు ఎలా తెలుసు?
5. 1 యోహాను 5:7, 8లో ఆత్మ, నీళ్లు, రక్తమనేవి దేన్ని సూచిస్తాయి?
6. అపొ. 2లో యేసును గూర్చి ఏ తీర్మానానికి రమ్మని పేతురు తన శ్రోతల నడిగాడు?
7. ఆచరణకు సంబంధించిన మాటల్లో యేసు యొక్క ఆధిపత్యమంటే ఏమి?

## పద సహాయకారి

**దావీదు పట్టణం –** బేత్లెహేము

**సిలువ మరణం –** సిలువపై వ్రేలాడుతూ మరణించడం; రోమీయులు మరణ శిక్ష విధించే ఒక విధానం. ప్రభువైన యేసు దోషరహితుడైనా, మన పాపములకొరకు

సిలువ వేయబడ్డాడు.

**రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు –** ప్రభువైన యేసుకు ఆయన గొప్పతనానికి అది సూచన, తక్కిన వారందరికంటే ఆయన పైగానున్నవాడు.

**పెంతెకొస్తు (పెంతెకొస్తు దినం) –** యూదుల వారముల పండుగ, దీన్ని ప్రథమ ఫలముల పండుగ అని కూడా అంటారు; ఆ రోజున సంఘం ఆరంభించబడింది (అపొ. 2).

**వినయముతో లోబడుట –** దేవునికిని ఆయన వాక్యమునకును లోబడుట, విధేయులగుట.